# సంకల్పం

## -పారుపూడి సూరి

''రంగా'' నా పొలికేక నాకే విచిత్రంగా అన్పించింది.

అందరూ నావేపు వింతగా చూసారు. నేను సిగ్గుతో చచ్చిపోయాను.

రంగ జనంలో కనుమరుగయ్యాడు.

నేను నిరుత్సాహంతో నీరుగారిపోయాను.

గార్డు విజిల్ వేయడం, బండి కదలడం ఒకేసారి జరిగాయి.

నేను హడావుడిగా బండి ఎక్కి నా సీట్లో చతికిలబడ్డాను.

నా మనసు గజిబిజిగా వుంది.

''వాడు నిశ్చయంగా రంగడే. ఎంత దూరం నుంచయినా గుర్తుపట్టగల ఆజానుబాహుడు. చిన్నతనం నుంచీ కలిసి పెరిగినవారం.

వాడికి నా కేక వినపడకపోవడానికి ఆస్కారంలేదు. జనంతోపాటు వాడూ వెనుదిరిగి చూసాడు. కానీ ఆగలేదు.

ఇన్నాళ్ల స్నేహం మరచిపోయాడా? పిచ్చిగా జుట్టు పీక్కున్నాను.

అసలింతకూ వాడు ఎందుకు కుంటుతున్నాడు? రెండు చంకల్లో ఆ కర్రలేమిటి? మెదడు మొద్దుబారిపోతోంది.

చిన్నతనం నుంచీ రెండేళ్ల క్రితంవరకూ ఇద్దరం ఎక్కడో అక్కడ కలుసుకునేవాళ్లం. హఠాత్తుగా లింక్ తెగిపోయింది. వాడి వునికి తెలుసుకునేందుకు నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. తర్వాత ఇదే కనబడడం. మళ్లీ మెరుపులా మాయమయ్యాడు.

ఇన్నాళ్లకు కనబడ్డాడు అనే ఆనందం వాడు జనంలో మాయమవడంతో మంచులా కరిగిపోయింది.

ఆలోచనలు మెదడును నల్చుకుతింటున్నాయి. అన్నీ వాడి ఊహలే. అనీజీగా వుంది. కానీ ఆశ చావలేదు. వెస్టిబ్యూల్ రైలు కనుక వాడ్ని ఎలాగైనా పట్టుకోగలను అనే ధీమా, ఆనందం కలిగిస్తుంటే వాడసలీ రైలు ఎక్కాడు అనే నమ్మకం ఏమిటి అనే నిరాశ నిత్తేజపరుస్తోంది.

మెల్లగా బాల్యంలోకి జారుకున్నాను.......

చిన్నతనంలో రంగ మా అందరకు ఆరాధ్యుడు, గురువు. ఎలాంటి సమస్యనైనా ఇట్టే పరిష్కరించగల తెలివైనవాడు. చిన్నతనంలో తెలిసేదికాదు రంగ అంటే ఏమిటో! బుద్ధి పెరుగుతున్నకొద్దీ వాడు అందరిలా సామాన్య వ్యక్తి కాదని తెలిసిపోయింది. ధైర్యానికి, చొరవకు, నీతీ నిజాయితీకి వాడికి వాడే సాటి. మాట తీరు, మాటకు మాట చెప్పే పదునైన వాడి పదాలు వాడి ఎదుటివాడి నోరు ఇట్టే మూయించగల సమర్థుడు. మాకేకాదు చివరకు పెద్దలు కూడా వాడిలోని సుగుణాలు గమనించి గౌరవం ఇచ్చేవారు. ఇటు మాకు అటు పెద్దలకు తలలో నాలుకలా వుండేవాడు. అయస్కాంతంలా అందర్నీ చుట్టూ తిప్పుకునే వాడి సాన్నిహిత్యం వెలలేని అనుభూతి . వాడంటే గౌరవంతో కూడిన భయం.

పన్నెండేళ్లకే నిలువెత్తు పెరిగి చిన్నసైజు పహిల్వానులా వుండేవాడు. గమ్మత్తయిన విషయం ఏమిటంటే వాడి తల్లిదండ్రులు పీలగా, సన్నగా వుండేవారు. వాడు భయపడేది తండ్రికొక్కడికే.

చిన్ననాటి అనుభవాలు ఎంత తీపిగా వుంటాయి!

''రంగా! రేపు అట్లతద్ది. మరచిపోలేదుగా''

''భలేవాడివే! వాడెక్కడ మరచిపోతాడు. ఈ ఒక్క రోజేకదా ఆడపిల్లల్ని ఏడిపించడానికి దొరికే బంగారు అవకాశం. పల్లేరుకాయలు దార్లో పోయవచ్చు. గోరింటాకును దురదగొండాకు కలిపి వాళ్లను మరింత బాధపెట్టవచ్చు'' మాలో ఎవరో అన్నాడు.

''తప్పురా వెధవా'' రంగా వాడ్ని నెత్తిమీద మొట్టి ''ఇది ఆడపిల్లల వేడుక. తెల్లవారుజామున ఆడపిల్లలు చీకటిలో ఆడుకుంటుంటే వారికి మనం బాడీగార్డులం మాత్రమే. అందుకే వారితోపాటు మనకు పీకలవరకూ మెక్కపెట్టేది. ఇప్పుడే చెబుతున్నాను. ఎవడన్నా వెధవ వేషాలు వేసాడో వాడి తాట వలిచేస్తాను. బీకేర్‌ఫుల్'' హెచ్చరించాడు.

ఆ శాసనం జవదాటే ధైర్యం ఎవరికీ లేదు.

కొందరు దొంగతనంగా దాచిన పల్లేరుకాయల్ని నిప్పుల్లో పోసి తగలెట్టారు. దురదగొండాకు మచ్చుకు కనబడకుండా భూస్థాపితం చేసారు.

మా అందరి రక్షణలో ఆడపిల్లలు భయం మరచి చీకూ చింతా లేకుండా ఆడుకునేవారు.

రైలు కాజీపేటలో ఆగింది. కూల్‌డ్రింక్ త్రాగి మళ్లీ ఆలోచనల్లో పడ్డాను.

మళ్లీ ఆలోచన్ల ముసురు.

ఎక్కువగా నేను, రంగ కలిసి తిరిగేవాళ్లం.

ఓరోజు-

''రంగా! కోటిపల్లి దిబ్బలమీద బోలెడు లేత ఆనపకాయలున్నాయి. లేత నవజులు. కోసుకొద్దాం వస్తావా?''

''అక్కడ ఆనపకాయలా? సరే పద చూద్దాం''

ఆనపకాయలు విరగకాసి ఉన్నాయి. నేను ఆనందంగా అరిచాను. అన్ని ఆనపకాయల్ని ఒక్కసారిగా చూడడం అదే మొదటిసారి.

''రంగా! లేతవి చూసి కోద్దాం. అందరికీ పంచవచ్చు'' నేను ముందుకు ఉరికాను.

''ఆగు'' రంగా వారించాడు. ''ఏమిటా తొందర? పురుగూ పుట్రా వుంటాయి'' పాదు చుట్టూ ప్రదక్షణ చేసాడు.

రంగా మీద పీకల దాకా కోపం వచ్చింది. ''నువ్వెప్పుడూ ఇంతే. నీ మాటే నెగ్గాలంటావు'' ఉక్రోషంగా అన్నాను.

''కోపం ఎందుకురా! కొంచెం తెలివి ఉపయోగించు. అసలిన్ని కాయలు ఎందుకు వున్నాయి ఇక్కడ? ఇవే కనుక మంచివి అయితే ఈపాటికి ఒక్క కాయ మిగిలుండేదికాదు. కనీసం పశువులన్నా తినేవి కదా. అసలెందుకు ఈ పాదునే నెమరేసేవి. పద పోదాం''

వాడి మాటలు తలకెక్కలేదు. అయిష్టంగానే వాడిని అనుసరించాను.

వస్తుంటే నా వాలకం గ్రహించి అన్నాడు రంగా ''ఒరే! ఇదే చెప్తున్నాను. వీటిని నాకు తెలీకుండా ఇంటికి తీసుకెళ్లావంటే తోలు వలిచేస్తాను''

నేను భయంగా తలూపాను. వాడు వెళ్లిపోయాడు. ఎందుకో వాడు చెప్పింది రుచించలేదు. వాడు అటు వెళ్లడం చూసి ఆబగా నాలుగు కాయలు కోసి ప్రయాసగా ఇంటికి తీసుకువెళ్లాను. మనసు పీకుతూనే వుంది. అయినా ధైర్యం కూడగట్టుకున్నాను.

ఒక్కసారన్నా రంగా చెప్పింది నిజం కాదని నిరూపించాలనే పట్టుదల పెరిగింది.

అమ్మ అడిగింది ''ఇన్ని కాయలు ఎక్కడివిరా?''

''కోటిపల్లి దిబ్బలమీద కాసాయి. ఇంకా బోలెడున్నాయి'' అమ్మ కూడా రంగాలాగే అంటుందేమోనని భయం వేసింది.

అప్పుడే వచ్చాడు రంగా. కోపంతో వాడి కళ్లు ఎర్రబడ్డాయి.

రంగ దొడ్లో పశువుల పాకలోకి వెళ్లాడు. వాడి వెనుకే అమ్మ వెళ్లింది. అమ్మను అనుసరించాను నేను.

మార్కెట్లో కొన్న కాయ ముక్కను గేదెకు పెట్టాడు. చిటికెలో తినేసింది. నేను తెచ్చిన ముక్కను అందించాడు. వాసన చూసి వదిలేసింది. రంగ ఎంత ప్రయత్నించినా దానికేసన్నా చూడలేదు.

''చూసారా! మనకూ పశువులకూ వున్న వ్యత్యాసం. వాసనబట్టి ఆ చేదు ఆనపకాయను తిన లేదు. మనమైతే వండుకుని తిని వాంతులు చేసుకునే వాళ్లం.''

నా ముఖంలో నెత్తురుచుక్క లేదు.

అమ్మ ఆ ముక్కను చిదిమి నోట్లో పెట్టుకుని ''ఛీ! థూ. చేదువిషం'' అంటూ ఉమ్మేసింది.

''రంగా! నువ్వు తెలివైనవాడివిరా'' అమ్మ వాడిని మెచ్చుకుంటుంటే నాకు తల కొట్టేసినంత పనయింది.

రంగా ఆ కాయల్ని దూరంగా పొదల్లో పారే సాడు.

పలుగు, పారాతో మా సైన్యాన్ని తీసుకుని ఆ ఆనప పాదులు నామరూపాలు లేకుండా చేసాడు.

ఆ రోజు తెల్సుకున్నాను రంగ నిశిత బుద్ధిని. వాడి దూరాలోచన ఎంత పవర్ ఫులో! వాడు దేన్నయినా సహిస్తాడుగానీ అన్యా యాన్ని, అవినీతిని సహిం చడు. ఆ విషయంలో వాడు ఎంత బలవంతుడ్నయినా లక్ష్యపెట్టడు.

ఎన్నో మరపురాని సంఘ టనల మధ్య మా బాల్యం గడిచి యవ్వనంలో అడుగు పెట్టాం. యవ్వనం దాటి ఉద్యోగాల్లో స్థిరపడ్డాము. వేర్వేరు ఊళ్లల్లో పని చేస్తున్నా ఉత్తర ప్రత్యుత్తరాలు తప్పనిసరి. ఏడాదికి ఒకసా రైనా కల్సుకోవడం అనే నియమం మరింత తప్పని సరి.

రంగ హైదరాబాద్‌లో ఆటోరిక్షా వాళ్ల ప్రతాపాలు విన్నాడు. హైదరాబాద్ వచ్చాడు. ఇద్దరం స్కూటర్ మీద రోడ్లు సర్వే మొదలుపెట్టాము. డ్రైవింగ్ నేను, కబుర్లు వాడు. ఇంతలో సడెన్‌గా ఎదుటి సందులోంచి ఆటోవాడు వచ్చి మమ్మల్ని గుద్దేశాడు. స్కూటర్ సొట్ట పడింది. నేను పడిపోయాను. రంగ స్ప్రింగ్‌లా లేచాడు.

''ఏరా! కళ్లు మూసుకుని నడుపుతున్నావు. ఏదీ నీ లైసెన్స్'' ఆటోవాడి మీదకు రాకెట్‌లా దూసుకువ చ్చాడు.

ఆటోవాడు హిందీలో ఏదో అన్నాడు.

రంగా వాడ్ని చాచిపెట్టి కొట్టాడు.


వాడు రోషంగా మీదకు వచ్చాడు.

వాడి చేతిని మెలి పెట్టాడు రంగా. వాడు బాధతో గిలగిలలాడాడు.

ఆటోవాడికి ఎవరూ సపోర్టు రాలేదు. తోకముడిచి ఆటో స్టార్టు చేయబోయాడు.

''ఎక్కడికి పోతావురా? నా స్కూటర్ రిపేరు ఎవరు చేస్తారు? నీ బాబా! తియ్ డబ్బులు తియ్'' రంగ ఆటో ముందు చక్రం గాల్లోకి లేపాడు.

ఏభై రూపాయలిచ్చి దండం పెట్టి పోయాడు ఆటోడ్రైవర్.



దార్లో అన్నాను నేను ''నేనైతే వాడికే రెండో మూడో వందలు అర్పించి వుండేవాడ్ని. నీలా దెబ్బలా డలేను''

★★★

అర్ధరాత్రి రైలు ఏదో చిన్న స్టేషన్లో ఆగింది.

క్రిందకు దిగి సిగరెట్ వెలిగించాను.

రైల్లోనే కాదు బయట కూడా గాలి స్తంభించిపో యింది. స్టేషన్లో లైట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి. పచార్లు చేస్తున్నాను. ఏదో కలకలం. ఎవర్నో కొడుతు న్నారు.

జేబులోంచి పెన్ టార్చి తీసి అటువేపు నడిచాను. చీకట్లో ఎవరినో కొడుతున్నారు. నేను రావడం చూసి మాయమయ్యారు.

మిగిలిన వ్యక్తిని పరికించి చూసాను.

రంగ!

నోటమాట రాలేదు క్షణంపాటు.

చివరకు గొంతు పెగుల్చుకుని ''రంగా! నువ్వా ఏమిట్రా? ఏం జరిగింది?'' అడిగాను.

''నేను రంగానే. పద జరిగింది చెప్తాను.'' క్రచెస్ ఆధారంగా కుంటుతూ నడుస్తున్నాడు రంగ. కుడి కాలు మోకాలువరకే వుంది.

''నీ బోగీ నెంబరెంత?''

చెప్పాను.

ఇద్దరం అటువైపు నడిచాము. ప్లాట్‌ఫారం నేలబా రుగా వుండడంవల్ల బోగీలో ఎక్కడానికి చాలా కష్టప డ్డాడు రంగ. నేను చేయి అందించాను.

సీట్లో కూర్చుని మంచినీళ్లు అందించాను.

తిరిగి గ్లాసు అందిస్తూ అన్నాడు ''స్టేషన్లో నీ కేక వినిపించింది''

ఆశ్చర్యపోయాను. ''మరెందుకు ఆగలేదు?''

''అప్పటికే సిగ్నల్ ఇచ్చారు. చూసావుగా రైలెక్కడం ఎంత కష్టమో నాకు''

రంగను అపార్థం చేసుకోవడం నన్ను నేను వంచిం చుకోవడమే. బాధపడ్డాను.

''నీ కోసం రైల్లో ఆ చివరి నుంచి ఈ చివరివ రకూ వెదికాను.''

''నాకు తెలుసు. కావాలని దాక్కున్నాను''

''అదేం?''

''నన్నీ స్థితిలో చూసి బాధపడతావు. ఆరాలు తీస్తావు. అసలు కనబడకపోతే క్రమంగా మరచిపోతావు. అదీ విషయం''

''రంగా!'' నా కంఠం పూడుకుపోయింది.

''ఎందుకలా జరిగిందోగానీ నిన్ను చూస్తుంటే నా రంగాయేనా అనిపిస్తోంది. ఎలాంటివాడివి ఎలా అయిపోయావు? నలుగురు కొడుతుంటే నిస్సహాయుడివి అయిపోయావు. నేను భరించలేకపోతున్నాను'' నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''ఒంటికాలితో పదిమందిని ఎదుర్కోవడానికి నేనేం సినిమా హీరోను కాను'' ఆ నవ్వులో మార్పు లేదు.

''అసలేం జరిగింది?''

''వాళ్లు దొంగతనం చేస్తుంటే అడ్డుకున్నాను. ప్రతిఫలం ఇచ్చారు'' నవ్వుతూ నుదుటి గాయాన్ని రుమాలుతో తుడుచుకున్నాను.

సూట్‌కేసు తెరిచి గాయాలమీద పౌడర్ అద్దాను.

రంగ మారలేదు. పరాయివారి మంచి కొరకు తను దెబ్బలు తిన్నాడు.

''నేనెక్కిన కంపార్ట్‌మెంట్‌లో పెళ్లివారు ఎక్కారు. పొరుగూరు వెళ్లి పెళ్లి చేస్తున్నారు కామోసు. నగలు గట్రా వున్నట్టున్నాయి. నా ఎదురుగా ఒకడు కూర్చుని వున్నాడు. వాడి దొంగచూపులు చూసి గ్రహించాను వాడొక దొంగ అని. వెనకాల నలుగురైదుగురు సహాయంగా వున్నారని. అందరూ నిద్రలో వుండగా తన పని కానిచ్చిపోవాలని వాడి ఎత్తు. ఎత్తుకు పైఎత్తుగా నేను మెలకువగా కూర్చున్నాను. వాడికి నేనొక ప్రతిబంధకం అయ్యాను. వాడు పోవాలంటే నేను నిద్రపోవాలి. నిద్ర నటించాను. వాడు మెల్లగా నగలున్న పెట్టెను ఇట్టే ఓపెన్ చేసాడు. నేను వాడ్ని పట్టుకుని 'దొంగ! దొంగ' అని అరిచాను. అందరూ మేల్కొన్నారు. వాడు నాకేసి కసిగా చూసి పారిపోయాడు. అందరూ నన్ను మెచ్చుకున్నారు. ఆ నగలు పోయుంటే వారంతా అభాసుపాలయ్యేవారు. వారి మొహాల్లో ఆనందం నాకు తృప్తినిచ్చింది''

''బావుంది. నీవు చేసింది మంచి పనే. కానీ దేహశుద్ధి జరిగింది''

''నాకేం కాదు. నేను బాత్రూమ్ వెళ్తుంటే బలవంతంగా నన్ను క్రిందకు దించి తమ కసి తీర్చుకున్నారు. ఇంతలో నీవు రావడం... కథ కంచికి వెళ్లింది'' రంగ మరోమారు నవ్వాడు అంత బాధలోనూ.

''పెళ్లివారికి మంచి నీకు చెడు జరిగిందన్నమాట''

నిట్టూర్చాను.

''నా సంగతి వదిలెయ్. ఆ నగలుపోతే వారి ఆనందం పటాపంచలు అయిపోతుంది. పెళ్లి ఆగిపోతుంది. అలా జరక్కుండా చేయగలిగానన్న తృప్తి మిగిలింది''

''హేట్సాఫ్ రంగా!'' మనసారా అభినందించాను.

''నీ జీవితం ఎలా వుంది? చెల్లాయ్, పిల్లలు ఎలా వున్నారు?''

''బాగానే ఉన్నారు. నీవు మాత్రం మారలేదురా రంగా! ఎన్నాళ్లిలా ప్రాణాలతో ఆడుకుంటావు? ఈ అవిటితనం కూడా నీ సాహసం పెట్టిన ప్రసాదమే అనుకుంటాను?''

''కాదు. నిజాయితీ పెట్టిన పరీక్ష! అందులోనూ నేనే నెగ్గాను''

వాడి మాటలు చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం అవలేదు. ఒక ప్రక్కన అవిటితనంతో బాధపడుతూ నెగ్గాను అంటాడేమిటి?

''నాకు దాంట్లో కూడా తృప్తి కనిపించింది.''

''ఏమిటి అవిటితనంతో జీవితాంతం బాధపడడమా?''

''నాకేం బాధ అనిపించలేదు. అలా జరగాలి అని రాసి పెట్టుంది. జరిగింది''

జీవితాన్ని అంత తేలిగ్గా తీసుకునే గుండె ధైర్యం రంగకు మాత్రమే ఉందనిపించింది.

''నీ సంగతి చెప్పవా?'' వాడ్ని చూస్తుంటే అడగాలనిపించలేదు. కానీ తెల్సుకోవాలనే జిజ్ఞాస మనిషికున్న దౌర్బల్యం.

''చెప్తాను. నేను ఢిల్లీ వాతావరణంలో ఇమడలేకపోయాను. పల్లెటూర్లో జీవించి అమాయకులకు సేవ చేయాలనిపించింది. దేముడి దయవలన బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరుగా సెలెక్టు అవడంతో మకాం రంగంపేటకు మార్చాను. కానీ నేను అనుకున్నది వేరు. అక్కడి వాతావరణం భిన్నంగా వుంది. అక్కడున్నవి రెండే కులాలు. ధనవంతులు, అతి బీదవారు. న్యాయం ధనవంతుల జేబులో బొమ్మ. బీదవారి చేతుల్లో తోలుబొమ్మ. బీదవాడు చిన్న తప్పు చేసినా అదొక క్షమించరాని నేరం. దానికి శిక్ష ఘోరంగా ఉంటుంది. మొత్తానికి ఓ మోతుబరి ఇంట్లో ఓ రూమ్ తీసుకున్నాను.

ఓరోజు సుడిగాలిలా ఆయన కూతురు పట్నం నుంచి వచ్చింది. కొద్దిరోజుల్లోనే తన వాంఛ బయట పెట్టింది. నేను చివాట్లు వేసాను. ఆ మర్నాడు ఇంటాయన పిలిచాడు.

''నా కూతుర్ని నిన్న ఏదో చేయబోయావుట? నాకు విషయం అర్థమైంది''

''నేనలాంటివాడ్ని కాదు''

''ప్రతి వెధవ పట్టుబడితే అలాగే అంటాడులే.''

''మీకు పరువే ముఖ్యమనుకుంటే వెంటనే మంచి సంబంధం చూసి కూతురికి పెళ్లి చేసి పంపండి. పాలు తాగే పాపాయి కాదు మీ కూతురు. ఆమెకు పెళ్లి అత్యవసరం. ఇంత జరిగాక ఇంకా ఈ ఇంట్లో వుంటాననుకోవడం మీ మూర్ఖత్వం. ఊరు వదిలిపోవడమనేది కల్ల. నేను గవర్నమెంటు ఆఫీసర్ని. ప్రభుత్వం నాకు అప్పగించిన బాధ్యత నెరవేర్చాలి. నన్నెవరూ ఆజ్ఞాపించలేరు''

ఆయనకు పుండుమీద కారం చల్లినట్లు అయింది. గట్టిగా అరుస్తూ ''ఏ కాలో చేయో తీస్తేగానీ నీవు దారికి రావు. అంతవరకూ తెచ్చుకోకు''

''కాళ్లూచేతులేకాదు పీక తీసేసినా నా నిర్ణయం మారదు. తప్పు చేయని నేను దేనికీ, ఎవరికీ భయపడను'' దృఢంగా అన్నాను.

సామాన్లు సర్దేశాను. రిక్షా తెచ్చి తక్షణం ఇల్లు ఖాళీ చేసాను. బ్రహ్మచారిని నాకెంత సామాను ఉంది కనుక.

ఇది జరిగిన నాలుగురోజులకు చీకటి పడ్డాక మోటార్‌సైకిల్‌పై మీద వస్తుంటే సర్రున కత్తి వచ్చి నా కుడికాలుకు తగిలింది.



## గౌతమి పెళ్లి!

తెలుగు అమ్మాయి అయి వుండీ తమిళ చిత్ర రంగంలో హీరోయిన్‌గా బాగా రాణించిన గౌతమి తెలుగులోనూ అనేక చిత్రాల్లో నటించింది. ఇటీవలే బిజెపిలో చేరి ఆ పార్టీ ఎన్నికల సభల్లో విశేషంగా ప్రచారం కూడా చేసిందామె. గౌతమికి సంబంధించిన తాజా సమాచారం ఏమిటంటే- ఆమె పెళ్లి సంగతి! దాదాపు రెండేళ్లుగా ముంబాయికి చెందిన సందీప్ భాటియా అనే బిజినెస్ మాగ్నాట్‌తో సాగుతున్న ప్రేమాయణానికి పెళ్లి తెరని వేయాలని నిర్ణయించుకున్నట్టుగా సినీ వర్గాల ద్వారా తెలుస్తోంది. గౌతమి సన్నిహితుల ఉవాచ ప్రకారం జూన్ నెలలోనే సందీప్-గౌతమిల వివాహం జరగనున్నట్టు వినికిడి. పెళ్లయ్యాక గౌతమి సినిమాల్లో నటిస్తుందా లేదా అనేది ఎదురుచూడాల్సిందే!

-జె.ఎం.

కాల్చిన ఇనుప చువ్వను ఉంచినంత బాధ. అలాగే ఊళ్లోకి వచ్చి పడ్డాను. స్పృహ తప్పింది.

మళ్లీ స్పృహలోకి వచ్చేటప్పటికి తెలిసింది నా కుడికాలు మోకాలు వరకు తీసేసారని. క్షణం బాధ తరువాత మామూలు మనిషిని అయ్యాను. ఇంచుమించు హాస్పిటల్లో నెలరోజులున్నాను. తల్చుకుంటే పోలీసులకు నిజం చెప్పి ఆయన్ను వీధిలోకి లాగడం క్షణం పట్టదు. అది నా అభిమతం కాదు. వారికేదో చెప్పి పంపించేసాను.

డిశ్చార్జ్ అయ్యేరోజున నా కోసం కారు వచ్చింది. ఆశ్చర్యం వేసింది.

డ్రైవర్ వినయంగా అన్నాడు ''అయ్యగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారు''

ఇంత చేసిన వాడింటికి వెళ్లాలనిపించలేదు. ''రాను'' అన్నాను.

''కాదయ్యా! ఆయనకు పక్షవాతం వచ్చింది''

మరోసారి ఆశ్చర్యపోయాను.

వెళ్లడానికి నిర్ణయించుకున్నాను.

వరండాలో సింహంలా అగుపించే ఆయన కనబడలేదు. కుర్చీ ఖాళీగా వుంది.

''లోపల పడుకున్నారు. రండి''

మంచంమీద ఆయన పడుకున్నాడు. ఆ కళ్లల్లో దీనత్వంతోపాటు పశ్చాత్తాపం కనిపించింది.

''ఏం జరిగింది?''

ఆయన ఎడం కాలు, కుడిచేయి పడిపోయాయి. మూతి వంకరపోయింది.

అల్పుడి నెత్తిమీద బలవంతుడు తన్నితే ఆ బలవంతుడ్ని బ్రహ్మ తంతాడు. సామెత ఇది.

''కూర్చో బాబు'' మాటలు అతి కష్టంగా వెలువడుతున్నాయి. ముద్దగా ఉన్నాయి.

ఆయన అందర్నీ పంపించేసాడు.

జరిగింది తెలిసింది. కూతురు పాలేరుతో లేచిపోయిందిట. ఆ క్షణంలో నాకు నిజంగానే బాధేసింది. ఆ షాక్ తట్టుకోలేక చెట్టంత మనిషి నిలువునా కూలిపోయాడు.

ఆయన మాటలు కూడబలుక్కుని అన్నాడు ''నీకు చేసిన అన్యాయానికి తగిన శాస్తి జరిగింది. దానికింత మగపిచ్చి వుందని తెలిస్తే వెంటనే పెళ్లి చేసుండేవాడ్ని. నువ్వేదో చేసావని అనుకున్నాను తప్ప దాని ప్లాన్ తెలుసుకోలేకపోయాను. అదెక్కడుందో తెలుసుకుంటే తప్ప నాకు మనశ్శాంతిలేదు.''

ఆయన మొహంలో దైన్యం నన్ను కదిలించింది.

''నేను వెళ్లి కనుక్కుంటాను. మీరు బెంగ పడకండి. అన్నీ సర్దుకుంటాయి. మీకిప్పుడు విశ్రాంతి ఎంత ముఖ్యమో మనశ్శాంతి కూడా అంతే ముఖ్యం''




ఆయన ఆశ్చర్యపోయి ''నువ్వా? ఈ పరిస్థితుల్లో నువ్వు వెళతావా? చేయికి చేయి ప్రాణానికి ప్రాణం అనే నా అహం నీ ఉదారతముందు కరిగిపోయిందయ్యా''

''అవన్నీ వదిలేసి ఆ పాలేరు పేరు, వాళ్లు ఎటు వెళ్లారో చూచాయిగా చెప్పండి''

ఆయన తన అనుమానం చెప్పాడు.

''ఈరోజు వెళతాను''

''కారు తీసుకువెళ్లు. మా ఆవిడతో చెప్తాను. కావాల్సినంత డబ్బు తీసుకువెళ్లు. దాన్ని గుండెలమీద ఆడించి పెంచాను. నా గుండెలమీద తన్ని వెళ్లిపోయింది. విశ్వాసఘాతకురాలు. ఒక్కతే కూతురని గారాబం చేసాను. అదుపు తప్పింది''

''గతం మర్చిపోండి. నాకు కారు వద్దు, డబ్బు వద్దు. నా అంతట నేనే వెళతాను''

''నీకు చేతులెత్తి నమస్కారం చేయాలి బాబూ. ఆ అవకాశం కూడా లాగేసుకున్నాడు దేవుడు'' ఎడం చేత్తో నా చేయి నొక్కారు. కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

ఆయన కళ్లు తుడిచి ధైర్యం చెప్పాను.

''తలగడ కింద చెక్కుబుక్కుంది. సంతకం చేసిన చెక్కు ఒక్కటే వుంది. అది నా అదృష్టం''

నాకు అర్థమవలేదు.

''నీ పోయిన కాలు తిరిగి తీసుకురాలేను. జీవితాంతం ఏ కష్టం లేకుండా బతికేందుకు కావాల్సిన అంకె వేసుకో. పది, పదిహేను లక్షలు. ఈ ఒక్క అవకాశం నాకివ్వు. కాదనకు...'' అర్థించాడు.

''నేను డబ్బు కోసం మీకీ సహాయం చేయడం లేదు. మీ అమ్మాయి నాకు చెల్లెలులాంటిది''

''నీ మంచితనం, మనస్తత్వం నాకు తెలుసు. నిన్ను కించపరచాలని కాదు నా ఉద్దేశ్యం''

నేను ససేమిరా అన్నా వినలేదు.

''నీ కోసం కాదు. నా కోసం తీసుకో. కనీసం ఓ మంచి పనికైనా ఆ డబ్బు వినియోగించి నన్ను రుణవిముక్తుడ్ని చేసి క్షమాభిక్ష పెట్టు'' ఆయన భోరుమన్నారు.

రాక్షసుడిలాంటివాడు అలా బీరువులా ఏడ్వడం పశ్చాత్తాపానికి పరాకాష్ట.

నేను చెక్కు తీసుకుని బయలుదేరాను.

ఆయన కూతురు, పాలేరును ప్రతి హోటల్ వెదికి వెదికి పట్టుకున్నాను. ఆ పాలేరు మరీ అంత అక్షరజ్ఞానంలేనివాడు కాదు. కొద్దో గొప్పో చదువుకున్నాడు. గుడ్డిలో మెల్ల.

వారిద్దరికీ ఓ ఇల్లు అమర్చి అతనికి నా పలుకుబడి ఉపయోగించి ఓ చిన్న ఉద్యోగం ఇప్పించాను. ఆ అమ్మాయిచేత ప్రమాణం చేయించుకున్నాను బుద్ధిగా వుంటానని. అతనికి హితబోధ చేసి నైట్ ట్యుటోరియల్స్‌లో చేర్పించాను. ఆ ఇద్దరూ నా కాళ్లకు దండంపెట్టారు. ఆ అమ్మాయి అన్నయ్య అని పిలవడంతో వివేకమైన పని చేసానని తృప్తి కలిగింది. అదీ నా కథ''

''రంగా! ఎంత ఎత్తుకు ఎదిగిపోయావు. తమ స్వార్థం, తమ జీవితం చుట్టూ పరిధి గీసుకునేవాళ్లకి నీ కథ ఒక గుణపాఠం కావాలి. నువ్వు ఆదర్శం కావాలి'' రంగాను ఆప్యాయంగా కౌగలించుకున్నాను.

''రంగా! చెక్కు సంగతి ఏమిటి?''

''హేండీక్రాఫ్ట్ శిక్షణాలయం ప్రారంభించుతున్నాను. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ నుంచి నాకు మంచి ప్రోత్సాహం లభించింది. ఆయనిచ్చిన డబ్బు ప్రారంభానికి సరిపోతుంది. మిగతాది గవర్నమెంటు ఇస్తుంది''

''మరి నీ ఉద్యోగం, పెళ్లి...?''

''ఇన్‌స్టిట్యూట్ నాకు ఉద్యోగం ఇస్తుంది. పెళ్లి మాటంటావా? ఈ అవిటితనంతో ఓ పిల్ల గొంతు కోయలేను. ఇక నా జీవితం పరోపకారానికి అంకితం చేస్తాను''

''ఎంత గొప్ప మనసు రంగా నీది? ఇదిగో నా డొనేషన్'' సూట్‌కేస్ తీసి పాతికవేలకు చెక్ రాసిచ్చాను.

''థాంక్స్‌రా. ఇలా నీలా ఎంతోమంది ముందుకు వస్తే కొంతమంది దౌర్భాగ్యుల జీవితాల్లో వసంతం వెల్లివిరుస్తుంది. నేవస్తాను''

నేను తేరుకునేలోపే రంగ కాళ్ల కర్రలు చప్పుడు దూరమైంది.

వాడి అడ్రస్ తీసుకోనందుకు నొచ్చుకున్నాను. ఇంతలో నాకు నేనే చెప్పుకున్నాను. ఆ చెక్ బ్యాంక్‌కి వచ్చినప్పుడు రంగా ఆచూకీ తప్పక తెలుస్తుంది.

ఏం అడ్డంకులూ లేనట్టున్నాయి రైలు వేగం పుంజుకుంది.

నేను మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

★